క్లుప్తంగా

సైనిక శిక్షణతో ప్రయోజనాలు


ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అధికారి

ఇంకొల్లు (చినగంజాం): విద్యార్థులు చిన్నతనం నుంచే సైనిక శిక్షణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. గురువారం పాఠశాలలో గత రెండు సంవత్సరాల్లో ఎన్‌సీసీలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రదానోత్సవం నిర్వహించారు. సర్టిఫికేట్ ప్రదానోత్సవ కార్యక్రమానికి 23వ ఆంధ్ర బెటాలియన్ చీరాల ఎన్‌సీసీ సుబేదారు బాబుసింగ్ భక్షి విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ బండారు అనిల్ కుమార్, ఎన్‌సీసీ క్యాడెట్‌లు పాల్గొన్నారు.

నేడు జీపీడీపీపై శిక్షణ తరగతులు

కారంచేడు: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు 2025–26 సంవత్సరాలకు గాను ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణ తరగతులకు జెడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, ఎంపిక చేయబడిన సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, ఏఓ, ఏపీఎం, ఏపీఓ, ఏఈలు, ఐసీడీఎస్, మెడికల్ ఆఫీసర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఓ అధ్యక్షుడు, కంప్యూటర్ ఆపరేటర్లు, డిజిటల్ అసిస్టెంట్‌లు హాజరుకావాలన్నారు. మొదటి బ్యాచ్‌లో కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ, స్వర్ణపాలెం, యర్రంవారిపాలెం, ఆదిపూడి, దగ్గుబాడు గ్రామాలకు, రెండో బ్యాచ్‌లో కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, జరుబులవారిపాలెం, పోతినవారిపాలెం, తిమిడెదపాడు, రంగప్ప నాయుడువారిపాలెం, నాయుడువారిపాలెం గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గిరిబాబు

చినగంజాం: జిల్లా తరఫున రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో పాల్గొని ప్రతిభ కనబరచడం ఎంతో గర్వకారణంగా ఉందని అంతర్జాతీయ క్రీడాకారుడు, బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మరుప్రోలు గిరిబాబు అన్నారు. స్థానిక ఎంఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో గురువారం రాత్రి ఇరువురు క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్‌లో శిక్షణ పొందిన గాలి శ్రీనివాసరెడ్డి, కోకి అంకులురెడ్డి అండర్–14, 17 కేటగిరిల్లో విశేష ప్రతిభ చాటారని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఇద్దరికి నగదు ప్రోత్సాహకాలు అందించారు. క్రీడాకారులను క్లబ్ కార్యదర్శి బోగిరెడ్డి నాగాంజనేయులు, వైస్ ప్రెసిడెంట్ బీ శివారెడ్డి, ట్రెజరర్ దేశం సుబ్బారెడ్డి, కంసాని సతీష్‌రెడ్డి, నిద్ర శ్రీనివాసరెడ్డి, చిట్ట మధుసూదనరెడ్డి, గాలి తిరుపతిరెడ్డి, అంకితరెడ్డి, నున్నా హరనాథ్ అభినందించారు.

మండల సమైక్య నూతన కార్యవర్గం ఎంపిక



జే.పంగులూరు: మండలంలోని పంగులూరు స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం మండల సమైక్య నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగినట్లు ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబు తెలిపారు. మండలంలో మొత్తం 38 గ్రామ సంఘాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. 38 గ్రామ సంఘాల అధ్యక్షులు అందరూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. నూతన కార్యవర్గంలో మండల సమైఖ్య అధ్యక్షురాలిగా జనకవరం గ్రామానికి చెందిన యెజండ్ల మాధవి, ఉపాధ్యక్షురాలిగా చందలూరు గ్రామానికి చెందిన కందిమళ్ల శైలజ, కోశాధికారిగా బూదవాడ గ్రామానికి చెందిన వజ్రాల కమలాదేవి, కోశాధికారిగా పంగులూరుకు చెందిన కరి భారతి, ఉప కార్యదర్శిగా కల్లవారిపాలేనికి చెందిన యర్రం పద్మావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రయాణికులకు టెన్షన్.. టెన్షన్


అద్దంకి బస్టాండ్‌లో తల పైకెత్తి చూస్తే ఇలా ..


బల్లికురవ బస్టాండ్ ఇలా..


బల్లికురవలో రోడ్డుపై ఆగిఉన్న బస్సు

- శ్లాబ్ పెచ్చులూడి పడుతున్న బస్టాండ్‌లు
- అద్దంకి, బల్లికురవలో పరిస్థితి ఘోరం
- భయాందోళనలో ప్రయాణికులు

అద్దంకి రూరల్: ప్రయాణికుల హడావుడి, బస్సుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటే అద్దంకి బస్టాండ్ శ్లాబ్ పెచ్చులూడిపడుతూ ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తోంది. అలాగే బల్లికురవ బస్టాండ్ కూడా అధ్వానంగా మారి ప్రయాణికులకు ఆందోళన కలిగిస్తోంది.

నాలుగు దశాబ్దాల బస్టాండ్

అద్దంకి పట్టణంలో సుమారు 40 సంవత్సరాల క్రితం ఇప్పుడు ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఆర్టీసీ బస్సులు, శ్రీరామ టాకీస్ వద్ద ప్రయివేటు బస్సులు ఆగేవి. అతి తక్కువ బస్సులు అద్దంకి వచ్చిపోతుండేవి. అయితే 1983లో అద్దంకిలో డిపోతోపాటు బస్టాండ్ ఏర్పడింది. అప్పటి నుంచి అద్దంకి మండలంలోని ప్రజలకు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అప్పుడు నిర్మాణం చేసిన బస్టాండే ఇప్పటి వరకు కొనసాగుతోంది. నలభై సంవత్సరాల క్రితం కట్టిన బస్టాండ్ లోపల పూర్తి స్థాయిలో శ్లాబ్ పెచ్చులూడి పడి తుప్పుపట్టిన ఐరన్ రాడ్‌లు బయటపడ్డాయి. తల ఎత్తి చూస్తే భయపడే పరిస్థితి నెలకొంది. ఇటీవల అక్కడ ఉన్న కుర్చీల్లో కూర్చున్న ప్రయాణిలకు శ్లాబ్ పెచ్చులు ఊడి పడ్డాయి. బిల్డింగ్ కాలపరిమితి దాటినా దానికే అప్పుడప్పుడు రంగులు వేస్తూ మేకప్ వేస్తుంటారు డిపో అధికారులు.

కనీస వసతులు కరువు

తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ మూడు రాష్ట్రాలు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాను సంబంధించిన ప్రయాణికులు ఇక్కడ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. బస్సుదిగి వేరే బస్సు ఎక్కేందుకు కాసేపు కూర్చునే ప్రయాణికులకు కనీసవసతులు కూడా లేవు. దుర్గంధంతో వెదజల్లే బాత్‌రూమ్‌లతో ప్రయాణిలు అవస్థలు పడుతుంటారు. బస్టాండ్‌లో వ్యాపార దుకాణాలు ఉండటంతో బయట నుంచి ప్రజలు వచ్చి గంటల తరబడి కాలక్షేపం చేస్తుంటారు. రాత్రి సమయాల్లో మందుబాబులు కూడా తమ పని పూర్తి చేసుకుంటున్నారు. ప్రయాణికులు పడుతున్న అవస్థల గురించి డీఎం రామ్మోహనరావును 'సాక్షి' వివరణ కోరగా ఉన్నతాధికారులకు తెలియజేశామని, వర్క్ ఆర్డర్ వచ్చాయని త్వరలో బాగు చేయించే పనులు చేపడతామని తెలిపారు.

బల్లికురవలో..

అద్దంకి మండలంలోని బల్లిరవలో 1987 బస్టాండ్ నిర్మాణం జరిగింది. పదేళ్లపాటు లోపలికి బస్సుల రాకపోకలు జరిగాయి. తదుపరి లోపలికి బస్సులు రాకపోవటంతో బస్టాండ్ ఆక్రమణలకు గురైంది. బాగోగులు పట్టించుకునే వారులేకపోవడంతో అధ్వానంగా మారింది. ఇప్పుడు బస్సులు నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డుమీద నిలుపుతున్నారు. ఇంకా మేరదమెట్లలో బస్టాండ్ కూడా వసతుల లేమితో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పంగులూరులో, సంతమాగులూరులో రోడ్లమీదే బస్సులు నిలుపుతున్నారు.

చాచా నెహ్రూ సేవలు మరువలేనివి


కఠారివారిపాలెంలో నెహ్రూకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


స్వర్ణ జేవీ ఎయిడెడ్‌లో దేశనాయకుల వేషధారణల్లో చిన్నారులు


ఉప్పుటూరులో బహుమతులందిస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు కృష్ణమోహన్

- ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు
- ఉత్సాహంగా బాలల దినోత్సవం
- సందడి చేసిన చిన్నారులు

చీరాల అర్బన్/చీరాల రూరల్/వేటపాలెం: దేశానికి చేసిన చాచా నెహ్రూ సేవలు మరువలేనివని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సెయింట్ ఆన్స్ స్కూలు ప్రిన్సిపాల్ సిస్టర్ జీనా జేవియర్ అన్నారు. జాతీయ బాలల దినోత్సవాన్ని గురువారం స్థానిక మరియమ్మపేటలోని పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపల్ సిస్టర్ జీనా జేవియర్, కరస్పాండెంట్ సిస్టర్ ఎల్లా ట్రెసాలు పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయినీలు కోలాట నృత్యాలు ప్రదర్శించి విద్యార్థులను అలరించారు. కార్యక్రమంలో స్కూలు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

▶ స్థానిక మసీదు సెంటర్‌లోని ఆసిఫ్ అలీ ఉర్దూ మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు చిన్నారులకు కేక్స్, స్వీట్లు పంపిణీ చేశారు.

▶ కఠారివారిపాలెంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి హెచ్‌ఎం సుబ్బారావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భవనం రాణి, జీ సుబ్బారావు, ఎం షీలాదేవి, రవీంద్ర, షేక్ నబీ రసూల్, జీ శ్రీనివాసులు, జీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలలంటే నెహ్రూకు చాలా ఇష్టం..

అద్దంకి రూరల్/అద్దంకి (సంతమాగులూరు): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ రోటరీ సభ్యుడు చెన్నుపల్లి వెంకటేశ్వర్లు కొత్తపేటలోని మహాత్మాగాంధీ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పండ్లు, బిస్కెట్‌లు, మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరీ మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, హెచ్‌ఎం వీర బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

▶ సంతమాగులూరు మండల ఎంఈవో కార్యాలయంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ ఎనుబర్ల యల్లమంద హాజరయ్యారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ..

చినగంజాం/మార్టూరు/కారంచేడు: తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకొని మండలంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రూత్ మెర్సీ జాయ్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

▶పర్చూరు మండలం ఉప్పుటూరులో రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో బహుమతులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం వసుంధర, క్లబ్ సభ్యులు సదానందరెడ్డి, కోట హరిప్రసాద్, శ్రీనివాసరావు, చంద్రం పాల్గొన్నారు.

▶ కారంచేడు మండలంలోని కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాలలో చాచాజీ చిత్రపటానికి హెచ్‌ఎం ఏ ఉమామహేశ్వరావు, దగ్గుబాడు మెయిన్‌లో హెచ్‌ఎం భవనం శ్రీనివాసరెడ్డి, మహాలక్ష్మమ్మలు బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వర్ణ, కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, కారంచేడు ఎన్‌టీఆర్ నగర్, యూపీ, యజ్ఞశాలపేట, కుంకలమర్రు మెయిన్‌లో హెచ్‌ఎం పావులూరి శ్రీనివాసరావు, సీసీలో నాగమణి, బాబూరావు, తిమిడెదపాడు, ఆదిపూడి ఉన్నత పాఠశాలలోను, స్వర్ణ మెయిన్, యర్రంవారిపాలెం, స్వర్ణ కుంకలమర్రు, ఉన్నత పాఠశాలల్లో నెహ్రూకు నివాళులర్పించారు.

▶ బాలల దినోత్సవం నిర్వహించడం ఎంతో అవసరం అని చినగంజాం ఎంఈవో బీ అజయ్ బాబు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆత్మారావు, హెచ్‌ఎంలు డీ రత్నకుమారి, షేక్ రసూలున్నీసా బేగం, ఎస్ నరసింహారావు, వై రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మార్టూరులో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం


విద్యార్థిని ఉషారాణికి నగదు అందిస్తున్న దాతలు

చీరాల టౌన్: పేద విద్యార్థిని చదువు కోసం దాతలు ఆర్థిక సాయం అందించారు. ఈపురుపాలెం గ్రామానికి చెందిన బూదాటి సాంబశివరావు చేనేత కార్మికుడిగా పనిచేస్తుంటాడు. కుమార్తె ఉషారాణి శ్రీకాకుళంలోని ఓ దంత కళాశాలలో సీటు వచ్చిన సందర్భంగా నగదు అందించారు. డాక్టర్ అందె మురళి వరప్రసాదరావు రూ.10 వేలు, డాక్టర్ జీ పున్నారావు రూ.5 వేలు, రిటైర్డ్ ఎస్‌ఈ పడవల పడవల శేష వరప్రసాదరావు రూ.5 వేలు, గోలి వెంకట సుబ్బమ్మ, గోలి గిరి రాజు రూ.5 వేలు, హవల్దార్ గోలి దేవేంద్రనాథం రూ.5 వేలు, వెంకటేశ్వరారావు రూ.5 వేలు, గంగాధరరావు రూ.5 వేలు మొత్తం రూ. 42 వేలు అందించారు.

ఎన్‌సీడీ సీడీ ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్


క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తున్న డాక్టర్ శాలినీ, వైద్య సిబ్బంది

స్వర్ణ (కారంచేడు): ఎన్‌సీడీ సీడీ 3.0 ద్వారా ఇకపై గ్రామల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా చేయనున్నట్లు స్వర్ణ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఎం శాలినీ అన్నారు. గురువారం ఆమె మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో గురువారం నుంచి ప్రారంభించిన క్యాన్సర్ స్క్రీనింగ్‌ను పరిశీలించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి ఇంటిలో ఎంత మంది నివసిస్తున్నారు. వారి ఆరోగ్య, ఆహారపు అలవాట్లు నమోదు చేయాల్సి ఉందన్నారు. అలాగే 18 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ పరీక్షలు కూడా చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఆమె స్వర్ణ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ద్వారా అన్ని రకాల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వీ నాగేశ్వరరావు, హెచ్‌ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు సహకరించాలి

మేదరమెట్ల: ఎయిడ్స్‌వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని.. ఆ విధంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తే వ్యాధి నిర్మూల చేయవచ్చని ఎంపీడీవో రాజ్యలక్ష్మి అన్నారు. జిల్లా హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా మండల కేంద్రం కొరిశపాడులో మండలంలోని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, ఎంపీటీసీలకు 'మీకు తెలుసా అవగాహన' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ సమాజంలో రోజు రోజుకూ హెచ్‌ఐవీ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయన్నారు. హెచ్‌ఐవీ నియంత్రణ కోసం జాతీయ టోల్ ఫ్రీ నంబరు 1097 పలు అంశాలను తెలియజేసే కరపత్రాలను కార్యక్రమంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెల్ప్ టీ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీసాగర్, ఎంపీపీ లక్ష్మీప్రసన్న, జెడ్పీటీసీ వెంకటరమణ, మల్లేశ్వరి, కృష్ణవేణి, పంచాయతీ సర్పంచ్‌లు, ఈవోలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మోయలేని భారం


కొరిశపాడులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



చీరాల తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


అద్దంకిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

అద్దంకి రూరల్/మేదరమెట్ల: అధిక ధరలతో ప్రజలపై కూటమి ప్రభుత్వం మోయలేని భారం వేసిందని సీపీఎం నాయకులు ధ్వజమెత్తారు. అద్దంకి మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు నిత్యం జరగుతూనే ఉన్నాయన్నారు. వీటిని అరికట్టటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యుత్ చార్జిలు అధికంగా పెంచి ప్రజలపైన మరింత భారం వేసిందని, ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు రావులపల్లి కోటేశ్వరరావు, ప్రమీల, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

▶ చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కొరిశపాడు మండల కార్యాలయం వద్ద మండల కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ సుబ్బారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రవీంద్రబాబు, లక్ష్మణ, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ సీఎం ధర్నా..

మార్టూరు/కారంచేడు: కార్మిక, కర్షక, ప్రజా సమస్యలు పరిష్కరించాలంటూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) మార్టూరు మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎన్నికల హామీలను నెరవేర్చాలని డీటీ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామకోటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

▶ ప్రజా సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పోరు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీపీఎం పార్టీ జిల్లా నాయకులు పీ కొండయ్య అన్నారు. కారంచేడు రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల స్థాయి నాయకులు పీ ఏడుకొండలు, సుబ్బారావు, హనుమంతరావు, యేసయ్య, వెంకటేశ్వరరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి..

చీరాల అర్బన్: విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు, ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని కోరుతూ సీపీఎం చీరాల ఏరియా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం చీరాల ఏరియా కార్యదర్శి ఎస్.బాబూరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేస్తామని, స్మార్ట్ మీటర్లు పెట్టబోమని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూఅప్ చార్జీల పేరుతో సుమారు రూ.18వేల కోట్లు భారాన్ని ప్రజలపై మోపారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వసంతరావు, ఎల్.జయరాజు, డి.నారపరెడ్డి, ప్రసాద్, బి.సుబ్బారావు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన బత్తుల


మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో బత్తుల బ్రహ్మానందరెడ్డి


పర్చూరు (చినగంజాం): వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి కలిశారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను కలిసి ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు చెందిన రాజకీయ పరిస్థితులను వివరించారు. జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియా యాక్టివిస్టులపై ప్రభుత్వ కేసుల పరంపర, నిర్బంధకాండ తీవ్రంగా సాగుతున్నాయని ఆయన వివరించారు. చంద్రబాబు ×ఇదిగో నీ మోసం, నీ సూపర్ సిక్స్ దీనికి కావాల్సిన బడ్జెట్ రూ.74 వేల కోట్లు, నీవు చేసింది మోసం కాదా? నువ్వు చెప్పేది అబద్ధం కాదా? నీ మీద 420 కేసు పెట్టకూడదా? ఇది ఆర్గనైజ్డ్ క్రైమ్ కాదా? అంశంపై ట్వీట్ చేయమన్న మీ పిలుపు అందరూ అమలు చేస్తున్నారు. విశేష స్పందన వస్తుంది. పార్టీలకు అతీతంగా ఉన్న ప్రజలు కూడా మీ పిలుపు అందుకొని ట్వీట్స్ చేస్తున్నారని జగన్ దృష్టికి తీసుకొని వెళ్లారు.

చీరాలలో భారీ వర్షం


పట్టణంలో కురుస్తున్న వర్షం

చీరాల: అల్పపీడనం కారణంగా చీరాల పరిసర ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. బుధ, గురువారం వాతావరణంలో మార్పులు వచ్చాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని పలు ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. పట్టణంలోని సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి రోడ్డు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కు, వాడరేవు బస్టాండ్, దర్బార్ రోడ్డులతో పలు ప్రాంతాలలో మోకాలు లోతులో వర్షపునీరు నిలిచింది. అలానే దర్బార్‌రోడ్డులోనూ నీరు నిలిచింది. డ్రైనేజీలలో వాననీరు పారుదల లేకపోవడంతో రహదారిపై నీరు చేరింది.

108 సిబ్బంది సమ్మె నోటీసులు


బల్లికురవలో డీటీకి వినతి పత్రం అందిస్తున్న 108 సిబ్బంది

బల్లికురవ/అద్దంకి: ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను కాపాడే తమను ప్రభుత్వం అదుకోవాలని.. లేకుంటే ఈనెల 25 నుంచి సమ్మెలోకి వెళ్తామని 108 సిబ్బంది పేర్కొన్నారు. గురువారం బల్లికురవలో డిప్యూటీటీ తహశీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రోజుకు 12 గంటల పని విధానం రద్దుతో 8 గంటలకు మార్చాలన్నారు. అరబిందో సంస్థ నుంచి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. రావల్సిన బకాయిలు చెల్లించాలని, చనిపోయిన కుటుంబాలకు రూ. 20 లక్షలు బీమా చెల్లించాలని వినతి పత్రంలో వివరించారు.

▶ అద్దంకిలో 108 జిల్లా కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు సమ్మె నోటీసు అందించారు.